క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు


అబ్దుల్ రషీద్

చీరాల/చీరాల టౌన్: వివిధ శాఖల్లో నూతనంగా అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చీరాల మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్ బాధ్యతలు స్వీకరించారు. వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన చీరాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి మాతృశాఖ అయిన అగ్రికల్చర్ శాఖకు బదిలీ అయ్యారు.


అఖిల

చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారిగా దేవరకొండ అఖిల ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆర్డీఓగా పనిచేసిన సూర్యనారాయణరెడ్డి బదిలీ అయ్యారు. చీరాల మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న పి.సురేష్ అద్దంకికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో పర్చూరు ఈడీటీగా పనిచేస్తున్న సూర్యనారాయణను చీరాలకు బదిలీ చేయగా బాధ్యతలు చేపట్టారు. అలానే ఎన్నికల డీటీగా కారంచేడు నుంచి వచ్చిన సుశీల విధుల్లో చేరారు.

పీఆర్ ఏఈగా మాధవ్..

బల్లికురవ: పంచాయతీరాజ్ ఏఈగా మాధవ్ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఏఈ పంగులూరు మండలానికి బదిలీపై వెళ్లారు. నరసరావుపేట సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న మాధవ్ ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అధికారులకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

చీరాల టౌన్: పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో మండలాన్ని నడిపిస్తానని నూతన ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన ఎంపీడీవో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించడంతో పాటుగా పెండింగ్ పనులను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ తప్పనిసరి

బల్లికురవ: ఈనెల 15వ తేదీ లోపుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను పూర్తిచేయాలని ఏపీఎం రాజారావు అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ అన్ని గ్రామ సంఘాల సీఐఎఫ్, శ్రీనిధి, ఉన్నతి మిగిలిన అంశాలపై రివ్యూ చేశామన్నారు. శ్రీనిధి, ఉన్నతి పెండింగ్ ఉన్న గ్రామ సంఘాలు త్వరగా రికవరీ చేయించాలని, అన్ని గ్రామ సంఘాలు తప్పనిసరిగా నెలవారీ గ్రామ సంఘ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ కె.భాస్కర్, ఈఈ రాయి పేరయ్య, అధ్యక్షురాలు రమాదేవి, పాల్గొన్నారు.

100 మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లతో ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇంటిపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొణిజేటి చేనేతపురి కాలనీలో బొడ్డు వెంకటేశ్వర్లు ఇంట్లో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈమేరకు దాడి చేసి బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు


పొంగళ్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

చినగంజాం: వర్షాలు బాగా కురవాలని గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కడవకుదురు గ్రామంలోని రెడ్లబజారుకు చెందిన మహిళలు శుక్రవారం వర్షాలు బాగా కురిసి పంటలు పండాలి అంటూ గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ దేవతలు పోలేరమ్మ తల్లి, గంగమ్మ తల్లి, పోతురాజులకు మహిళలు చీర, సారెలతో నైవేద్యం సమర్పించారు. పొంగళ్లను తలపై ఉంచుకొని గ్రామంలో ఊరేగింపుగా గ్రామ పొలిమేరలో ఉన్న దేవతల చెంతకు వెళ్లి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో భారీ వర్షం కురవడం విశేషం.


అధ్వాన స్థితిలో చెన్నుపల్లి-వైదన లింకు రోడ్డు


బల్లికురవ-మార్టూరు రోడ్డు దుస్థితి ఇలా..


అధ్వాన స్థితిలో బల్లికురవ-నాగరాజుపల్లి రోడ్డు

గుంత గుంతలో.. మంచి ప్రభుత్వం

- అధ్వాన స్థితిలో ఆర్అండ్ బి లింక్ రోడ్డు
- అడుగడుగునా గోతులతో తరచూ ప్రమాదాలు
- మండలంలో 60 కిలో మీటర్ల మేర అధ్వాన స్థితి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, అధికారులు


మార్టూరు రోడ్‌లో బోల్తా కొట్టిన పాల వాహనం


గ్రానైట్ నిర్వాహకుల కారణంగా చెన్నుపల్లి-అనంతపురం రోడ్డు ఇలా

బల్లికురవ: 'ఇది మంచి ప్రభుత్వం' వంద రోజుల కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంపద సృష్టి పేపర్ మీద తప్పా ఎక్కడా కనిపించడం లేదు. కేవలం దుష్ప్రచారాలు చేసుకుంటూ ప్రతిపక్షంపై బురదజల్లుతూ రాజకీయం చేస్తున్నారే తప్పా పాలన చేయడం లేదని స్పష్టంగా కనిపిస్తోంది. మండలంలోని ఆర్అండ్‌బీ లింకు రోడ్లు అధ్వానస్థితిలో మోకాటి లోతు గోతులు ఏర్పడ్డాయి. పది కిలోమీటర్ల ప్రయాణానికి సైతం గోతుల పుణ్యమా అంటూ 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతోంది. ఇటీవల మార్టూరు నుంచి బల్లికురవ వస్తున్న పాల వాహనం గోతుల ధాటికి అదుపు తప్పి బోల్తా కొట్టింది. బల్లికురవ, నాగరాజుపల్లి, మార్టూరు ఆర్ అండ్ బీ రోడ్డు ఆరు కిలో మీటర్లు అధ్వాన స్థితిలో ఉంది. ఇక్కడ డబుల్ రోడ్డుగా విస్తరించే పనులు పదేళ్లగా ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. ఈరోడ్డు బల్లికురవ, కొనిదెన, రాజుపాలెం జాతీయ రహదారిని కలుపుతుంది. ఇదే రోడ్‌లోని శాంతినగర్ నుంచి మార్టూరు వెళ్లే లింకు రోడ్డు 15 కిలో మీటర్ల అధ్వాన స్థితిలో ఉంది. చెన్నుపల్లి, కొండాయపాలెం, మల్లాయ్యపాలెం, వేమవరం జంక్షన్ మీదుగా అనంతవరం వెళ్లే రోడ్డు ఐదేళ్ల క్రితం డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచారు. ఈ రోడ్డులో ఈర్లకొండ వద్ద గ్రానైట్ నిర్వాహకులు యంత్రాలను రోడ్డుపై నడపడంతో పాటు లోడింగ్‌లు చేయడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మొత్తం మీద మండలంలో 60 కిలో మీటర్ల మేర రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

వర్షాకాలంలో కనిపించని రోడ్లు..

రోడ్డు ధ్వంసం అవడం వలన తారు రోడ్డు సైతం మట్టి రోడ్డుగా మారిపోయింది. వర్షాకాలంలో జారుడు బల్లను తలపించింది. చెన్నుపల్లి, వైదన, కొప్పరపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, రామాంజనేయపురం, ముక్తేశ్వరం, గుంటుపల్లి, ఇసుక దర్శి, ఉప్పమాగులూరు, వేమవరం జంక్షన్, కొణిదెన, కూకట్లపల్లి, వెలమవారిపాలెం లింకు రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకుంటూనే ఉన్నాయి. గోతులతో పాటు చిల్లచెట్లు పెరగటంతో బస్సులను సైతం రద్దు చేశారు.

లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలి..



అధ్వాన స్థితికి చేరిన రోడ్లతో బస్సులను కూడా రద్దు చేశారు. వర్షాకాలంలో గోతులు, చిల్లచెట్లు పెరగడం వలన ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కూటమి ప్రభుత్వం తక్షణమే రోడ్లను అభివృద్ధి పరిచి బస్సులను పునరుద్ధరించాలి.

– హెచ్ కిషోర్ నాయక్, కొత్తూరు

నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు..



వైదన లింకు రోడ్డు అభివృద్ధికి రూ.14 లక్షలు నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. గోతులు, చిల్ల చెట్లు కమ్మటం వలన ఈ రోడ్డులో ప్రయాణం సాగడం లేదు. గతంలో మూడు బస్సులు తిరిగే రోడ్డులో ప్రస్తుతం ఒక్క బస్సు ఒక ట్రిప్పుకు పరిమితమైంది. మార్టూరు రోడ్లను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.

– కే శివారెడ్డి, సూరేపల్లి, చెన్నుపల్లి

ప్రతిపాదనలు రాగానే పనులు చేయిస్తాం..

రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాం. కార్యరూపం దాల్చగానే టెండర్లతో పనులు చేపడతాం. దమ్ము సీజన్ ఆరంభమైనందున దమ్ము ట్రాక్టర్లు పొలంలోకి వెళ్లి చక్రాలు బిగించుకోవాలి. దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం చేయవద్దు.

– బాబ్జి, ఆర్ అండ్ బీ, జేఈ

అవినీతి, అక్రమాలు చేస్తే ఉపేక్షించం


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

చీరాల టౌన్: అవినీతి, అక్రమాలను సహించను.. రెవెన్యూ సమస్యలు ఉన్న వారు నేరుగా అర్జీలిస్తే సత్వరమే స్పందించి పరిష్కరిస్తానని చీరాల ఆర్డీవో దేవరకొండ అఖిల స్పష్టం చేశారు. ఆర్డీవోగా భాద్యతలు చేపట్టిన అనంతరం చీరాల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో పరిశీలించారు. చీరాల మండలంలో ఉన్న ప్రధాన సమస్యలు, పెండింగ్ పనులు, తదితర అంశాలపై తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణతో చర్చించారు. కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, మండలంలోని గ్రామాలు, తదితర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మీడియాతో మాట్లాడుతూ చీరాల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని మండలాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తనను నేరుగా సంప్రదించాలని, ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కారం చేస్తానన్నారు.

పొలంబడితో శాస్త్రవేత్తలుగా రైతులు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటకృష్ణ

అద్దంకి: రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే పొలంబడి లక్ష్యమని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. కలవకూరు గ్రామంలో వరి పొలం వద్ద నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి వ్యవసాయాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు, సూక్ష్మ పోషకాలపై చిత్రాలతో అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరిలో చీడపీడలు తక్కువగా ఉన్నాయని అనవసరంగా పురుగు మందులు పిచికారీ చేయకూడదని తెలిపారు. అక్కడక్కడా ఆకుచుట్టు పురుగు ఉందని దాని నివారణకు వేపనూనె 400 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

శేషవాహనంపై భావన్నారాయణుడు


గరుడోత్సవంలో పండితులు, కమిటీ సభ్యులు

చినగంజాం: స్థానిక శ్రీదేవి, భూదేవీ సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలతో కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా గ్రామ బలిహరణ, అనంతరం గరుడోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి గరుడ పతాకాన్ని ఆలయ ధ్వజ స్తంభంపై ఆరోహింపజేశారు. వేద పండితులు పరాశరం రామాచార్యులు, ఆలయ అర్చకులు మోహన లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భావన్నారాయణ మహిళా కోలాట భజన మండలి, లలితా రామకోటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వలివేటి శివనారాయణ, వీవీ రామానుజం, వీ విశ్వనాథ బాబు, జీ పిచ్చయ్య, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి


స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న బాపట్ల డీఎస్పీ

బల్లికురవ: పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి పెట్టి పరిష్కరించాలని బాపట్ల డీఎస్పీ జీ రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మమేకం అవుతూ శాంతిభద్రతలను నిత్యం పర్యవేక్షించాలన్నారు. పరిశీలనలో సంతమాగులూరు సీఐ కే వెంకట్రావు, ఎస్సై జీవి చౌదరిపాల్గొన్నారు. పోలీసు స్టేషన్‌కు తొలిసారి వచ్చి డీఎస్పీకి ఎమ్మార్పీఎస్ నాయకులు కందుకూరు పేతురు, బొంతు మోహన్, నరసారావు, పి రామయ్య, బండి బాబు, రవి, తంగిరాల నాగార్జునలు సత్కరించారు.

పేద విద్యార్థికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత


విద్యార్థికి నగదు సాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మార్టూరు: కళాశాల చదువు నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ పేద విద్యార్థికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ శుక్రవారం ఆర్థిక సహాయం అందజేసింది. స్థానిక వీరగంధం డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న షేక్ అబ్దుల్ బాసిత్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోయే పరిస్థితి ఏర్పడటంతో విషయం తెలుసుకున్న సంస్థ బృందం శుక్రవారం కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరికి 5 వేలు ఫీజు నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు పఠాన్ ఖాదరవలి, కన్నెగంటి శ్రీను, కే. హరిబాబు, పుట్ట అయ్యప్పస్వామి, తదితరులు పాల్గొన్నారు.


కారంచేడులో బాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు


పంగులూరు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో గాయత్రి దేవిగా అమ్మవారు



జాగర్లమూడిలో అలంకరణలో ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారు


మార్టూరు బొడ్డురాయి సెంటర్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..


అద్దంకిలోని దత్తపాదుకా క్షేత్రంలో భువనేశ్వరీ దేవి..

వేద స్వరూపిణీ పాహిమాం..

సాక్షి నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సకలవేద స్వరూపిణి గాయత్రీదేవి. సకలమంత్ర సిద్ధి, జ్ఞానం, తేజస్సు గాయత్రి మాత దర్శనంతో కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు అలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గాయత్రి హోమం, లలిత సహస్రనామ పారాయణం చేశారు.


చీరాల జక్కావారివీధిలో అలంకరణలో అమ్మవారు


ఈపూరుపాలెంలోని పెద్దపందిరిలో అమ్మవారి ప్రతిమ


మేదరమెట్ల మిద్దెలదొంక రోడ్డులో గాయిత్రిదేవి అలంకరణలో అమ్మవారు


నూతలపాడులో గాయత్రి దేవి అవతారంలో అమ్మవారు

రేపటి నుంచి పర్చూరులో ఉచిత క్రికెట్ కోచింగ్

పర్చూరు (చినగంజాం): స్థానిక పర్చూరులోని క్రికెట్ గ్రౌండులో ఈనెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉచితంగా క్రికెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు కోచ్ తులసి శివనాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు 8 రోజులపాటు కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. క్రికెట్‌పై ఆసక్తి ఉన్న వారు 81432 14124, 79666 774132 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డీఈ ఏసయ్య సేవలు అభినందనీయం


డీఈ ఏసయ్యను సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

చీరాల రూరల్: డీఈ ఏసయ్య సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి బదిలీపై ఒంగోలు వెళ్తున్న మున్సిపల్ డీఈ ఏసయ్యను చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్అండ్‌పిఎం హైస్కూలు క్రీడా మైదానంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్‌లు మాట్లాడారు. ఏసయ్య హైస్కూలులో ఏర్పాటు చేసిన పార్కు, క్రీడా మైదానంతో పాటు పట్టణంలో అనేక అభివృద్ధి పనులను చేశారని కొనియాడారు. అంతేకాక నాడు-నేడు కింద కొత్త స్కూలు భవనాలు, కుందేరు వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు, విద్యుత్ స్తంభాలకు లైటింగ్ ఏర్పాటు చేయడం వంటి పనులను చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో దిరియా సాహెబ్, గుర్రం బధిరి, డి. తిరుపతి రావు, సిహెచ్. రమేష్, బాల గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.